# వృథాగా వీధివిక్రయ కేంద్రాలు

- గదుల్లో నిద్రపోతున్న యాచకులు
- వ్యాపారులకు కేటాయించని అధికారులు
- అవగాహన కల్పించని మెప్మా సిబ్బంది


వీక్లీ మార్కెట్‌లో రోడ్డుపై కూరగాయల విక్రయాలు


ఖాళీగా ఉన్న నాందేవ్‌వాడలోని వీధి వ్యాపారుల వర్తక సముదాయం

**నిజామాబాద్ సిటీ:** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కూరగాయల విక్రయాల కోసమే ప్రత్యేకంగా నిర్మించిన స్ట్రీట్ వెండింగ్ జోన్స్ వృథాగా మారాయి. నగరంలోని హమాల్‌వాడీ, కోటగల్లీల్లో నిర్మించిన ఈ సముదాయాలు బిచ్చగాళ్లకు (యాచకులకు) నిలయాలుగా మారాయి. పగటిపూట ఆకతాయిలకు అడ్డాగా.. రాత్రివేళ బిచ్చగాళ్లు నిద్రించేందుకు ఉపయోగపడుతోంది. బల్దియా నిర్మించిన ఉద్దేశం మాత్రం నీరుగారుతోంది.

**రూ.10 లక్షలతో 25 గదులు....**

ఇందూరులో రద్దీ ప్రదేశాల్లో ముందుగా పైలెట్ ప్రాజెక్టుగా రెండు ప్రదేశాలను ఎంపిక చేశారు. నాందేవ్‌వాడ చౌరస్తా, కోటగల్లీ (ఉషామయూరి థియేటర్ వెనుక)ల్లో రెండు కూరగాయల మినీ మార్కెట్ నిర్మించారు. ఇందుకుగాను మెప్మా నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. వీటిని నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ఇక్కడ ఒకసారి కూడా కూరగాయలు విక్రయించలేదు.

**మెప్మా నిర్లక్ష్యం...**

స్థానికంగా ఉండే మహిళలు, ఇతర వీధి విక్రయదారులకు అవగాహన కల్పించాల్సింది మెప్మా సిబ్బందే. ముఖ్యంగా సీసీలు, ఆపై అధికారులు. వీరు నామ మాత్రంగానే పనులు నిర్వహిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. కేవలం డబ్బులు వచ్చే పనుల్లో మాత్రమే అత్యంత శ్రద్ధ చూపుతారన్ని పేరుంది. ముఖ్యంగా లోన్లు మంజూరు చేయించడం. ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన వాటిపై మాత్రం దృష్టి కేంద్రీకరించరు. దానికి ప్రత్యేక ఉదాహరణే వృథాగా మారిన ఈ వీధి విక్రయ కేంద్రాలు. ముందుగా పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మించిన రెండు విజయవంతమైతే. నగరంలో మరిన్ని నిర్మించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. నగరంలో ముఖ్యమైన కూడళ్లలో దాదాపు 10 వరకు వీధి విక్రయాలు నిర్మించాలన్నది లక్ష్యం. అయితే ముందుగా నిర్మించిన రెండు వృథాగా ఉండటంతో కొత్తవాటిని నిర్మించే వాటికి అడ్డంకిగా మారింది.


సముదాయంలో నిద్రపోతున్న యాచకుడు

**దుమ్ము, ధూళిలోనే అమ్మకాలు..**

నగరంలో చాలా చోట్ల రోడ్లపైనే కూరగాయలు అమ్ముతున్నారు. రోడ్ల పక్కన, మోరీల వద్ద అనారోగ్యకర పదార్థాలు విక్రయిస్తున్నారు. అయినా ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో కొంటున్నారు.

### జనాభాకు సరిపడా విక్రయ కేంద్రాలుండాలి



నగర జనాభాకు సరిపడా విక్రయ కేంద్రాలుండాలి. కూరగాయల కోసం గంజ్‌కు వెళ్లాలంటే ఇబ్బంది కర పరిస్థితి ఉంది. నగరానికి నలువైపులా, ప్రధాన గల్లీల్లో కూడా విక్రయ కేంద్రాలు నెలకొల్పాలి. ప్రజల అవసరాలు గుర్తించాలి. అధికారులు ఆ దిశగా అడుగులు వేయాలి.

– అరికెల సత్యనారాయణ, సుభాష్ నగర్

### ముందుకు వస్తే మహిళా గ్రూపులకు కేటాయిస్తాం



నగరంలో పైలెట్ ప్రాజెక్టు కింద రెండు స్ట్రీట్ వెండింగ్ జోన్స్ నిర్మించాం. చాలా రోజులుగా వృథాగా ఉన్నాయి. గతంలో కేటాయిస్తామంటే కొందరు అడ్డుకున్నారు. ఇబ్బందులు పెట్టారు. స్థానిక నాయకులు ప్రోత్సహించలేదు. కమిషనర్ దిలీప్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాం. ఎవరు ముందుకు వచ్చినా వెంటనే వారికి అప్పగిస్తాం.

– చిదుర రమేష్ గుప్తా, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్

## ఉగ్రవాదులను ఎన్‌కౌంటర్ చేయాలి


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, కార్యకర్తలు

**డిచ్‌పల్లి:** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై పాశవికంగా దాడులు జరిపి 28 మందిని పొట్టన బెట్టుకున్న ఉగ్రవాదులను ఎక్కడున్నా కనిపెట్టి ఎన్‌కౌంటర్ చేయాలని ధర్పల్లి మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నుంచి రైల్వేస్టేషన్ మీదుగా మార్కెట్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఉగ్రదాడిలో మరణించి అమరులకు నివాళులర్పించారు. అనంతరం బాజిరెడ్డి జగన్ మాట్లాడుతూ.. పాకిస్తాన్ అండతో ఉగ్రవాదులు అమాయకులైన భారతీయులను కాల్చి చంపడం దారుణమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం నిఘా చర్యలను పటిష్టం చేయాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు దాసరి లక్ష్మీనర్సయ్య, శక్కరికొండ కృష్ణ, నీరడి పద్మారావు, యూసుఫ్, కుంచాల రాజు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### డిచ్‌పల్లి ఎంపీడీవోగా బూక్య లింగం నాయక్



**డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి ఎంపీడీవోగా బూక్య లింగం నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వేల్పూర్ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లింగం నాయక్ డిచ్‌పల్లి ఎంపీడీవోగా నియామకమయ్యారు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేసిన సూపరింటెండెంట్ నివేదిత డిప్యుటేషన్‌పై వేల్పూర్ మండల సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. పలువురు అభినందనలు తెలిపారు.

### ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**మోపాల్:** మండలంలోని మంచిప్పలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో సైబర్ నేరగాళ్ల వలలో 32 మంది చిక్కుకున్నారని, అప్రమత్తం గా ఉండాలని కౌన్సిలర్ డి శ్రీనివాస్, జ్యోత్స్న సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ దేవిదాస్, బైరాపూర్ కారోబార్ వేణు, సాయన్న, సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### సామాజిక రుగ్మతలను నివారించాలి



**నిజామాబాద్ రూరల్:** కవులు తమ రచనల ద్వారా సామాజిక రుగ్మతలను నిర్మూలించాలని సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రేమ్‌లాల్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని వినాయక్‌నగర్ సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కవి తమ రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తేవాలని కోరారు. సమావేశంలో వేముల శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఐవోసీఎల్ ప్రతినిధులకు భగవద్గీత అందజేత



**సుభాష్‌నగర్:** నగరంలో ఐవోసీఎల్ కంపెనీ ప్రతినిధులకు మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మంచాల జ్ఞానేందర్ భగవద్గీత, వారాహిమాత చిత్ర పటాన్ని శుక్రవారం అందజేశారు. ఐవోసీఎల్ కంపెనీ ప్రతినిధులు అనిల్ కుమార్, పీయూష్ మిట్టల్, ముక్కారం, పూర్ణ చందర్, డీలర్స్ పాల్గొన్నారు.

### నోట్ బుక్స్ ఆవిష్కరణ



**ఖలీల్ వాడి:** నగరంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ పి.సాయి చైతన్యని ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ చేతుల మీదుగా నోట్ బుక్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పిల్లలకి ఉపయోగపడే విధంగా పుస్తకాల పంపిణీ నా చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు మల్ల మారి సుధాకర్, తదితరులున్నారు.

### 28 నుంచి ఉచిత యోగా సంస్కార శిక్షణ శిబిరం

**నిజామాబాద్ రూరల్:** నగరంలోని సుభాష్‌నగర్‌లో గల దయానంద యోగ కేంద్రం ఈ నెల 28 నుంచి బాల బాలికలకు వేసవి కాల ఉచిత యోగ సంస్కార శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగాచార్యులు రాంచందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 నుండి 15 ఏళ్ల బాలబాలికలు రావచ్చన్నారు. పురుషులకు ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు, మహిళలకు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9849845550, 9398504054 నెంబర్లను సంప్రదించాలన్నారు.

### మోడల్ స్కూల్‌లో అడ్మిషన్‌కు రేపు ప్రవేశ పరీక్ష

**రుద్రూర్:** మండలంలోని అంబం(ఆర్) శివారులో గల మోడల్ స్కూల్‌లో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 27న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ టి. చెన్నప్ప తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సందేహాల నివృత్తి కోసం 94922 07033కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు.

## ఊరికి దూరంగా.. నిరుపయోగంగా

- నిర్వహణ భారంగా మారిన రైతు వేదికలు
- సౌకర్యాలు లేక తప్పని ఇక్కట్లు

**ధర్పల్లి:** వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి రైతులకు అధునాతన వ్యవసాయ పద్ధతులు వివరించడం, వారంతా ఒకే చోట సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా గత ప్రభుత్వ హయాంలో రూ.22 లక్షలు వెచ్చించి రైతు వేదికను నిర్మించారు. ధర్పల్లి మండలంలో ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా ఏర్పాటుచేసి రామడుగు, దుబ్బాక, ధర్పల్లి, హోన్నాజీపేటలో ఈ విధంగా నాలుగు చోట్ల రైతు వేదికలను నిర్మించారు. ఇందులో కొన్ని గ్రామాలకు రైతు వేదికలు దూరంగా ఉండటంతో రైతులు అక్కడికి వెళ్లడానికి ఆసక్తిని చూపడం లేదు. రైతు వేదికల నిర్వహణకు ప్రతి నెలా రూ.9 వేలను ప్రభుత్వం కేటాయించింది. ఈ మొత్తాన్ని తాగునీరు, విద్యుత్ బిల్లు, స్వీపర్, స్టేషనరీ ఇతర ఖర్చులకు ఉపయోగించాలి. ఇంత వరకు బాగానే ఉన్నా రెండేళ్లుగా రైతు వేదికల నిర్వహణ ఖర్చులకు నిధులు విడుదల కావడం లేదు. ప్రస్తుతానికి ఏఈవోలు రైతు వేదికల నిర్వహణ బాధ్యతలను చూస్తున్నారు. రైతులకు శిక్షణ సమయంలో తాగునీరు, స్టేషనరీ ఇతర ఖర్చులు ఏఈవోలకు ఇబ్బందిగా మారాయి.


వసతులు అంతంత మాత్రమే..

రైతు వేదికలు చాలా చోట్ల గ్రామాలకు దూరంగా ఉన్నాయి. ప్రహరీ గోడ, భద్రతా సిబ్బంది లేకపోవడంతో రైతు వేదికలోని సామగ్రిని ధ్వంసం చేయడం, ఎత్తుకెళ్లడం వంటివి జరిగాయి. రైతు వేదికల చుట్టూ పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల నీటి వసతి లేకపోవడంతో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ అధ్వానంగా మారింది. ఎరువులు, విత్తనాల పంపిణీ రైతు వేదికల్లో చేపట్టాలని నిర్ణయించినప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. ఇటీవల మండల కేంద్రాల్లోని రైతు వేదికలలో ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు సలహాలు సూచనలు తెలియజేస్తారు. కాని రైతులు ఈ కార్యక్రమంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. రైతు వేదికలకు నిర్వహణ ఖర్చులు విడుదల చేసి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

### హెడ్ కానిస్టేబుల్ కుమారుడికి సత్కారం


ఐఏఎస్‌కు ఎంపికైన సాయిచైతన్యను సత్కరిస్తున్న సీపీ సాయిచైతన్య

**ఖలీల్ వాడి:** జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గోవిందరావు కుమారుడు సాయి చైతన్య సివిల్స్‌లో 68వ ర్యాంకు సాధించి ఐఏఎస్ సాధించారు. నిజామాబాదు పోలీస్ క్యాంప్ కార్యాలయంలో ఐఏఎస్ సాధించిన సాయి చైతన్యని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్‌ని అభినందించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది 24/7 విధులు నిర్వహిస్తూ తమ పిల్లలను చక్కని చదువులు చదివించి ఉన్నత స్థాయి అధికారులు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. డిచ్‌పల్లి సీఐ మల్లేష్, రిజర్వ్ సీఐ శ్రీనివాస్(అడ్మిన్), తిరుపతి(వెల్ఫేర్) పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షకీల్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

### తరగతుల బహిష్కరణ


తరగతులను బహిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**నిజామాబాద్‌అర్బన్:** నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో విద్యాబోధన చేపడుతున్న గూపన్‌పల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళనలకు దిగారు. తరగతులను అడ్డుకొని విద్యార్థులను ఇంటికి పంపించారు. నిబంధనలను తుంగలో తొక్కి వేసవి సెలవులలో తొమ్మిదవ, పదవ తరగతి విద్యార్థులకు క్లాసులు నిర్వహిస్తున్న పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు ప్రకటించిందని గుర్తు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి చక్రి, నాయకులు శివ, అఖి, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పించాలి



జక్రాన్‌పల్లిలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

**జక్రాన్‌పల్లి:** ఉపాధి పథకంలో ప్రతి ఒక్కరికి పని కల్పించాలని డీఆర్‌డీవో సాయాగౌడ్ సూచించారు. శుక్రవారం జక్రాన్‌పల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామి సామాజిక తనిఖీ నిర్వహించారు. పనులు చేయకుండానే పనులు చేసినట్లు మస్టర్లలో హాజరు వేసి డబ్బులు చెల్లించారని, ఈ డబ్బులు రికవరీ చేయాలని డీఆర్‌డీవో.. అధికారులను ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒకే జాబ్ కార్డు ఉండేలా చూడాలన్నారు. గ్రామాల్లో మొక్కలు నాటగా సగానికి పైగా ఎండిపోయాయని తెలిపారు. వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. సామాజిక తనిఖీలో ఆయా గ్రామాల్లోని చేపట్టిన పనులు, కూలీలకు చెల్లించిన డబ్బులు, నిధులు దుర్వినియోగం తదితర వివరాలను చదివి వినిపించారు. జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ఎస్ఆర్‌పీ రవి, ఎంపీడీవో సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 'కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను తిప్పికొడతాం'

**నిజామాబాద్ సిటీ:** పని గంటల పెంపుదలను నిరసిస్తూ, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను తిప్పికొట్టాలని టీయూసీఐ నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కోటగల్లీ ఎన్ఆర్‌భవన్‌లో 139వ మేడే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముష్కు సుధాకర్ మాట్లాడుతూ.. దేశంలో 40 కోట్ల మంది శ్రమజీవులకు సరిపడా వేతనాలు, జీవన భద్రత లేవన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 15 చట్టాలను కేంద్ర ప్రభుత్వం అడ్రస్ లేకుండా చేస్తూ, మిగతా 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా ఆమోదించి, అమలు చేయాలని చూడడం వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారబోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు వెంకన్న, కిషన్, సాయన్న, రవి, సాయిబాబా, తదితరులున్నారు.


మేడే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

### సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి



**నిజామాబాద్ సిటీ:** మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం పోరాడదామని ఐఎఫ్‌టీయూ నేత మచ్చ మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లో 139వ మేడే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. 50 సంవత్సరాలు దాటిన హమాలీ కార్మికులకు నెలకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక నాయకులు రాజు, రమేష్, మల్లేష్, శ్రీనివాస్, దాసు, జుబేర్, మునీర్, విజయ్, విట్టల్, కరీం పాల్గొన్నారు.

### సిరికొండలో..




**సిరికొండ:** మండల కేంద్రంలో మేడే వాల్ పోస్టర్లను ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. టీ యూసీఐ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడు తూ.. 139వ మేడే వేడుకలను విజయవంతం చేయాలన్నారు. మేడే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టాలని కోరారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు దామోదర్, సాయారెడ్డి, బొర్రన్న, బాలకిషన్, సుజాత, సా యవ్వ, రాజవ్వ తదితరులున్నారు.

## పర్యాటకులపై దాడి అమానుషం


నగరంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు


పడకల్‌లో కొవ్వొత్తులతో నివాళి

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి అమానుషమని అభివర్ణిస్తూ అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలో మృతులకు నివాళులర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. దాడులకు పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాక్‌తో మెతకవైఖరి తగదన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. – సాక్షి నెట్‌వర్క్


గుండారంలో ర్యాలీ చేపడుతున్న బీజేపీ నాయకులు, ప్రజలు


నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నివాళి


నగరంలో గీత సత్సంగం ప్రతినిధుల ఆధ్వర్యంలో నివాళి


ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్న న్యూడెమోక్రసీ నేతలు

### జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక



**సిరికొండ:** జాతీయ మేజర్ లీగ్ బేస్‌బాల్ ఇండియా కప్–2025 పోటీలకు నిజామాబాద్ పైరేట్స్ (సిరికొండ సత్యశోధక్ పాఠశాల) జట్టు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య శుక్రవారం తెలిపారు. ఆర్మూర్‌లో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగిన మేజర్ లీగ్ బేస్‌బాల్ అండర్–11 ఛాంపియన్ షిప్ పోటీల్లో నిజామాబాద్ పైరేట్స్(సత్యశోధక్) జట్టు విజేతగా నిలిచి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. రీజినల్ స్థాయిలో లీగ్ దశలో నిజామాబాద్ పైరేట్స్ జట్టుతో పాటు 12 జట్లు పాల్గొనగా తొర్లికొండ జట్టుపై సత్యశోధక్ జట్టు విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. మేజర్ లీగ్ బేస్‌బాల్ కప్ ఇండియా హెడ్ ఇంచార్జ్ జపాన్‌కు చెందిన రియో చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. బెంగుళూర్‌లో జూన్ మొదటి వారంలో జరిగే జాతీయ మేజర్ లీగ్ పోటీల్లో సత్యశోధక్ జట్టు పాల్గొంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

## సినిమాలు

**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | జింఖానా(తెలుగు)-11.00, 4.40, 7.40, 10.30 |
| | అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి(తెలుగు)-1.40 |
| స్క్రీన్-2 | సారంగపాణి జాతకం(తెలుగు)- 10.40, 1.30, 4.30, 7.30, 10.30 |
| స్క్రీన్-3 | చౌర్యపాఠం(తెలుగు)-11.0 |
| | సూర్యపేట జంక్షన్(తెలుగు)-4.40, 10.20 |
| | అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి(తెలుగు)-7.30 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | సారంగపాణి జాతకం(తెలుగు)- 10.40, 1.30, 4.20, 7.10, 10.00 |
| స్క్రీన్-2 | శివశంభో(తెలుగు)-11.10 |
| | జింఖానా(తెలుగు)-10.40 |
| స్క్రీన్-3 | జింఖానా(తెలుగు)-11.25, 7.25 |
| | చౌర్యపాఠం(తెలుగు)- 2.20 |
| స్క్రీన్ -4 | ఏఎల్‌సీసీ ఓ యునివర్సల్ బ్యాచిలర్ -11.25 |
| | అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి(తెలుగు)-2.00 |
| | సోదరా(తెలుగు)-7.35 |
| | సూర్యపేట జంక్షన్(తెలుగు)-10.25 |

లలితామహల్ సారంగపాణి జాతకం (తెలుగు)

దేవి జింఖానా(తెలుగు)-11.00 2.00

అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి (తెలుగు)- 6.00 10.00

నటరాజ్ సూర్యాపేట్ జంక్షన్ (హిందీ)

విజయ్ మ్యాడ్ స్క్వేర్ (తెలుగు)

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 98,000 | వెండి(కిలో) | 1,03,000 |
| 22 క్యారెట్స్ | 90,465 | | |

– నిజామాబాద్ బిజినెస్

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్సడ్ | 200 |
| | | లైవ్ | 140 |
| స్కిన్‌లెస్ | 240 | మటన్ | 800 |

### కూరగాయల ధరలు(రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 10 | 20 | గాజరుగడ్డ | 40 | 80 |
| బెండకాయ | 35 | 50 | పచ్చిమిర్చి | 40 | 60 |
| బీరకాయ | 50 | 80 | దోసకాయ | 12 | 24 |
| దొండకాయ | 25 | 50 | ఆలుగడ్డ | 25 | 50 |
| బీర్నీసుకాయ | 100 | 150 | గోబిగడ్డ | 12 | 24 |
| కాకరకాయ | 35 | 60 | గోబిపువ్వు | 35 | 60 |
| వంకాయ | 20 | 40 | బీట్‌రూట్ | 20 | 40 |
| పాలకూర | 15 | 30 | కరివేపాకు | 60 | 100 |
| మెంతికూర | 70 | 100 | చామగడ్డ | 60 | 80 |
| కొత్తిమీర | 25 | 50 | గోరుచిక్కుడు | 40 | 60 |
| పుదీనా | 40 | 60 | చిక్కుడుకాయ | 50 | 80 |
| క్యాప్సికం | 50 | 80 | మామిడికాయ | 20 | 40 |

–సుభాష్‌నగర్